సాక్షి శ్రీకాకుళం

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



గంజాయి స్మగ్లర్లు అరెస్టు

ఇచ్ఛాపురం, కంచిలిలో గంజాయి స్మగ్లర్లు దొరికారు. వారి వద్ద నుంచి 18 కిలోల గంజాయి లభ్యమైంది. -8లో



ప్రాణం తీసిన సరదా

లాంగ్‌డ్రైవ్ సరదా ఒకరి ప్రాణం తీసింది. ఒడిశా నుంచి బెంగళూరుకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. -8లో

మండపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ఇచ్ఛాపురం రూరల్: నియోజకవర్గంలో అభివృద్ధి చెందిన పంచాయతీ ఏదీ అంటే ఠక్కున గుర్తుకు వచ్చేది మండపల్లి పంచాయతీ. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారు సర్పంచ్ పిట్ట శశిరేఖ చెక్ పవర్ రద్దు చేశారు అధికారులు. పంచాయతీ నిధులను సర్పంచ్ దుర్వినియోగం చేశారన్న అభియోగంతో డీపీఓ భారతి సౌజన్య చెక్ పవర్ రద్దు చేసినట్లు శుక్రవారం తమకు ఉత్తర్వులు ద్వారా తెలిపారని ఎంపీడీఓ కె.రామారావు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

టీనేజర్ల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: యుక్త వయస్సులో ఉన్న మహిళలపై వారి ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టిని సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంతో ఐసీడీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలపై కారణాలను విశ్లేషించి ప్రతి సీడీపీఓ ఒక కేస్ స్టడీతో తర్వాత నెల జరిగే సమీక్షా సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. గ్రామ స్థాయిలో బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఆదేశించారు. ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు వివరాలను విశ్లేషణ చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



ఆదిత్యుని జ్ఞాపికను జస్టిస్ దంపతులకు అందజేస్తున్న కనకరాజు తదితరులు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం సూపరింటెండెంట్ కనకరాజు, అర్చకులు ఇప్పిలి క్షేమేంద్ర శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను, ఇటీవల జరిగిన కుంభసంక్రమణ అభిషేక పూజల వివరాలను వివరించారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: మార్చి 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి, జిల్లాలో గల పెండింగ్ కేసులను తగ్గించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు భవనంలో శుక్రవారం పోలీస్ అధికారులు, బీమా కంపెనీలు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, మూడో అదనపు జిల్లా జడ్జి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాల్గో అదనపు జిల్లా జడ్జి ఎస్ ఎల్ ఫణి కుమార్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు, మాంసంపై అపోహలు వద్దు



బర్డ్‌ఫ్లూ నియంత్రణపై సూచనలు తెలియజేస్తున్న జేడీ రాజగోపాల రావు

పాతపట్నం: కోడిగుడ్లు, కోడిమాంసంపై అపోహలు వద్దని శ్రీకాకుళం జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు (జేడీ) డాక్టర్ కంచరాన రాజగోపాల్‌రావు అన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి నియంత్రణలో భాగంగా శుక్రవారం జేడీ పాతపట్నం, వసుంధర రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, పశుసంవర్ధశాఖ సిబ్బందికి బర్డ్ ఫ్లూ నియంత్రణపై సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాధిని గోదావరి జిల్లాలోని కోళ్లలో నిర్ధారించడంతో ఇక్కడ కూడా తనిఖీలు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో బర్డ్‌ఫ్లూ నమోదు కాలేదని, జిల్లాలోని కోళ్లలో అసాధారణ మరణాలు కూడా లేవని తెలిపారు. ముందస్తు వ్యాధి నిరోధక చర్యలలో భాగంగా జిల్లాలోని కోళ్ల రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కోళ్ల రవాణాపై స్థానిక చెక్‌పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా అంతటా రాపిడ్ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేసి, ఎలాంటి సందర్భంలోనైనా ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

పరిశోధన.. తీవ్ర వేదన



మా ప్రాణాలు నిలబెట్టండి



నాకు కిడ్నీ వ్యాధి సోకి సుమారు పదేళ్లు దాటింది. వారానికి మూడుసార్లు పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. కిడ్నీ వ్యాధి రాకుండా కారణాలు ఏమిటో ఇప్పటికైనా తెలుసుకుని ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు చెప్పాలని కోరుతున్నాము. మా లాంటి వ్యాధి గ్రస్తులకు మందులు, సౌకర్యాలు పెంచి మా ప్రాణాలను కాపాడాలను వేడుకుంటున్నాము.

– పైల మాధవరావు, కిడ్నీ వ్యాధి గ్రస్తుడు, పలాస డయాలసిస్ యూనిట్

- అంతుచిక్కని కిడ్నీ వ్యాధి మూలాలు
- శాంపిల్స్ సేకరించినా పరిశోధన ఫలితాల వెల్లడిలో తీవ్ర జాప్యం
- అటు ప్రభుత్వ ధనం వృధా.. ఇటు వ్యాధి గ్రస్తులకు క్షోభ
- కిడ్నీ వ్యాధులపై విధి విధానాలు లేని కూటమి ప్రభుత్వం

కాశీబుగ్గ:

పచ్చటి ఉద్దానాన్ని ఎప్పటి నుంచో వేధిస్తున్న కిడ్నీ సమస్య మూలాలు తెలుసుకోవడంలో అంతులేని జాప్యం జరుగుతోంది. ఇక్కడ కిడ్నీ చావులు అతి సాధారణమైపోయిన దయనీయ స్థితి నెలకొంది. రెండు దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న కిడ్నీవ్యాధిని ప్రభుత్వాలు నియంత్రించలేక పోతున్నాయి. పోతున్న ప్రాణాలను డయాలసిస్‌తో కొద్ది రోజులు ఆపగలుగుతున్నారు తప్పితే మనుషులను మాత్రం కాపాడలేకపోతున్నారు. అలాంటి ఉద్దాన ప్రాంతంలో గత పదేళ్లుగా పలు సంస్థలు, బృందాలు పరిశోధనలు జరుపుతున్నాయి తప్పితే కారణం తెలపలేకపోతున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం అమెరికా నుంచి శాస్త్రవేత్తలను తీసుకువచ్చి శాంపిల్స్ సేకరించామని చెప్పింది. కానీ ఇన్ని రోజులైనా వాటి ఫలితాలేమిటో ఎవరూ చెప్పలేకపోయారు.

ఎప్పటికప్పుడు పరిశోధనలు..

ఉద్దానంలో చాలా ఏళ్లుగా చాలా బృందాలు పరిశోధనలు జరుపుతున్నాయి. కానీ ఇతిమిద్ధంగా ఇదీ కారణం అంటూ ఏమీ చెప్పలేకపోయాయి. 2019 వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. వ్యాధి పరిశోధనలకు రంగం సిద్ధం చేసింది. డయాలసిస్ యూనిట్‌లు పెంచడం, రూ.పదివేల పింఛన్లు కూడా అందజేసింది. 2024లో వచ్చిన కూటమి ప్రభుత్వం కిడ్నీ వ్యాధి గ్రస్తుల ప్రాంతాల్లో జార్జ్ యూనివర్సిటీ వారితో వివిధ రకాల శాంపిల్స్ సేకరించినప్పటికీ ఇంతవరకు ఫలితాలు వెల్లడించలేదు. ఇదే చాలా మందిని కలవరపెడుతోంది.



పలాసలోని కిడ్నీ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతున్న రోగులు



కిడ్నీ బాధితుడికి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలలో ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో సుమారు 807 గ్రామాలలో కిడ్నీ వ్యాధి గ్రస్తులు 20 వేల మంది ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 పట్టణ ప్రాథమిక కేంద్రాలు, 6 సామాజిక ఆస్పత్రులు ఉన్నాయి.

సేకరించిన శాంపిల్స్ ఇవే

- ఉద్దాన ప్రాంతంలో ప్రజలు తాగుతున్న నీటి శాంపిల్స్, వాడుకలకు వాడుతున్న నీరు, పంట పొలాలకు ఉపయోగిస్తున్న నీటి శాంపిల్స్ సేకరించారు.
- రక్తంలో ఉన్నటువంటి సీరం, ఆర్ఎన్ఏ, డిఎన్ఎ, ప్లాస్మా వంటివి వ్యాధి గ్రస్తుల నుంచి సేకరిస్తున్నారు.
- వ్యాధి గ్రస్తుల నుంచి సేకరించిన యూరిన్‌ను పరీక్షలకు పంపించారు.
- ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం వ్యాధి గ్రస్తుల జుట్టు, మట్టి శాంపిల్స్ అమెరికాకు పంపించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఫలితాలు రాకపోవడం అందరూ విస్తుపోతున్నారు.

ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం



పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో నాల్గో అంతస్తు మొత్తం పరిశోధనలకు కేటాయించాం. అక్కడ జార్జ్ యూనివర్సిటీ వారు పరిశోధనలు జరుపుతున్నారు. ఇటీవల జుత్తు, మట్టి శాంపిల్స్ రసాయ శాస్త్రానికి చెందిన శాస్త్రవేత్తలు ఉద్దానంలో పర్యటించి వాటిని అమె రికా తీసుకుని వెళ్లారు. వారి నుంచి ఇంకా సమాచారం రావాల్సి ఉంది. మేము ఉన్నత అధికారులను కలిసి వారిని సంప్రదించి వారి నుంచి కిడ్నీవ్యాధికి గల కారణాలు తెలిస్తే ప్రభుత్వం దృష్టిలో పెట్టి వెల్లడిస్తాం. అంతవరకు ఏమీ చెప్పలేం.

– డాక్టర్ అల్లు పద్మజ, సూపరింటెండెంట్, కిడ్నీ పరిశోధన కేంద్రం

ఉపాధి ఉద్యోగులపై వేధింపులు సరికాదు



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న డ్వామా ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నతాధికారి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వ్యవహార శైలి, సమయ పాలన లేకపోవడంతో ఉద్యోగులం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఉపాధి పథకంలోని వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు శుక్రవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర రావు, అలాగే జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుని కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు ఉద్యోగులు డచ్ భవనం వద్ద సమావేశం నిర్వహించి వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లా ఉపాధి హామీ పథకం సిబ్బందిని కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని, ఉద్యోగులందరినీ దోషులుగాను, దొంగలుగా భావించి మాట్లాడడం సరికాదన్నారు. కార్యాలయంలో రాత్రి సమయాల్లో పనులు పురమాయించడం, రాత్రి వేళల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు, టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ వ్యక్తిగత జీవితాలకు భంగం కలిగిస్తున్నారని వాపోయారు. రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో వేతనాలు కల్పించి జిల్లాకు 400 కోట్ల రూపాయలు మెటీరియల్ కాంపోనెంట్ నిధులను సమకూర్చిన ఘనత ఈ జిల్లా ఉపాధి హామీ పథకం సిబ్బందికి దక్కుతుందని అన్నారు. కానీ నిత్యం అవమానాలతో కించపరిచే విధంగా మాట్లాడడం, సంక్రాంతి పర్వదినాల్లో కూడా సెలవులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. సామాజిక తనిఖీ ఆడిట్లో జరిమానాలు, రికవరీలు విపరీత స్థాయిలో ఉంటున్నాయని వీటిని కుదించాలని వివక్ష చూపించడం సరికాదని వారు పేర్కొన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు కూడా వినతిపత్రాన్ని ఉపాధి హామీ ఉద్యోగులు కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ నాయకులు వైవీ రమణ, అమ్మి నాయుడు, జయరాం, తవిటి నాయుడు, తెంబూరు రవి, అరుణ్ కుమార్, ప్రేమ లత, ప్రమీల, రత్నాకర్, ధర్మారావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీసీలో విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రం (టీటీడీసీ)లో శుక్రవారం సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్) అధికారులు విచారణ నిర్వహించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కోర్సులు నిర్వహిస్తున్నా రు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పర్యవేక్షణ లో టీటీడీసీ కొనసాగుతోంది. అయితే సీడాప్‌లోని కొందరు సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పలువురు అధికారులపై ఫిర్యాదులు చేశారు. ప్రధానంగా ఇక్కడ శిక్షణ క్లాస్ రూంలు, ల్యాబ్‌లకోసం అందజేసిన ఏసీలు, లాప్‌ట్యాప్ లు వంటివి మాయమైనట్లు ఆరోపించారు. దీంతో విజయవాడ నుంచి వచ్చిన సీడాప్ అధికారులు రహస్యంగా విచారణ నిర్వహించారు. శిక్షణతో సంబంధం ఉన్న వారిని ప్రైవేటుగా విచారించి ధ్రువీకరణ తీసుకున్నారు. మంజూరైన కంప్యూటర్లు, ల్యాప్‌లాప్‌లు, ఏసీలు, ఇతర సామగ్రి పరిశీలించారు. ప్రధానంగా ఏసీలు, లాప్ ట్యాప్‌లు చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందాయి. ఈ అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రం పరిశీలనకు వచ్చిన డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ వద్ద ఈ అంశం ప్రస్తావించగా, సీడాప్ అధికారులు విచారణ చేస్తున్న విషయం నిజమేనని అన్నారు. అయితే వ్యక్తిగతంగా ఎవరిపైనా విచారణ సాగటం లేదని చెప్పారు.

సంద్రం వెనకడుగు



వాతావరణంలో సంభవించిన మార్పుల ప్రభావంతో మండలంలో గల అక్కుపల్లి శివసాగర్ తీరంలో సముద్రం శుక్రవారం సుమారు 100 మీటర్లు వెనక్కి వెళ్లింది. గత కొద్ది రోజులుగా సముద్రంలో ఏర్పడిన మార్పుల ప్రభావంతో సముద్ర కెరటాలు ఎగిసిపడుతూ ముందుకు దూసుకురావడంతో పాటు ఒక్కసారిగా వెనక్కి వెళ్తున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. ఈ మార్పులు తమలో గుబులు పుట్టిస్తున్నాయని అన్నారు. -వజ్రపుకొత్తూరు రూరల్



వంశధార నదిలో డీ-సిల్టేషన్ ర్యాంపులోకి వేసిన అక్రమంగా వేసిన రాచబాట

అక్రమాల జాతర



గార: గార మండల కేంద్రంలోని డీ సిల్టేషన్ ర్యాంపులో ఇసుక అక్రమాల జాతర జరుగుతోంది. దీనికి అధికారులే ప్రత్యక్ష సాక్షులుగా నిలిచారు. కళింగపట్నం– పాలకొండ రోడ్డుకు ఆనుకొని ఉన్న డీ-సిల్టేషన్ ర్యాంపులో ఇష్టానుసారం ఇసుక తరలింపు జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుకపై అనేక జీఓలు విడుదలతో పాటు స్వయానా ముఖ్యమంత్రి సైతం ఇసుక వాహనాలు ఆపవద్దు అని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. అదే వరమై వాల్టా వంటి చట్టాలు సైతం మంటగలుపుతూ ఇక్కడ ఇసుకను తవ్వి తోడేస్తున్నారు. గురువారం సాయంత్రం శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయిప్రత్యూష రిజర్వ్‌డ్ పోలీసుల సాయంతో ర్యాంపును తనిఖీ చేశారు. స్వయానా మండల అధికారుల టీమ్‌తో పరిశీలించారు. వంశధార నదిలో ఉన్న రెండు హిటాచీలను సీజ్ చేయమని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. వాటి తాళాలను గార పోలీసులకు అప్పజెప్పారు. ఇదిలా ఉండగా ఈ ర్యాంపు సమీపంలోనే రక్షిత మంచినీటి పథకంతో పాటు పదుల సంఖ్యలో వ్యవసాయ పంపుసెట్లు, నది గట్టు చెంతనే ఆర్ అండ్‌బీ రోడ్డు ఉన్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న జీఓ ప్రకారం గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఇరిగేషన్ శాఖ నుంచి ఒకరు, మైన్స్ శాఖ నుంచి ఒకరు ఉండి ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో వచ్చిన వాహనాలకు ఇసుకను ఇవ్వాలి. కానీ ఇక్కడ ఇవేమీ అమలు కావడం లేదని గుర్తించారు. ఎవరూ వస్తున్నా ముందుగానే సంబంధిత శాఖలకు తెలియడంతో అంతా గుప్‌చుప్‌గా జరిగిపోతోంది. సీజ్ చేసిన తర్వాత కూడా శుక్రవారం ఉదయం హిటాచీలు స్టాక్ చేసిన ఇసుక వద్దనే ఉన్నాయి. వీటి తాళాలు మాత్రం గార పోలీస్‌స్టేషన్‌లో ఉన్నా.. ఎప్పటి మాదిరిగా పలు ఖాళీ వాహనాలు మాత్రం ఇసుక కోసం ఎదురు చూస్తుండటం కొసమెరుపు.



ర్యాంపులో ఆర్డీఓ సాయిప్రత్యూష పరిశీలన

ఒక్క రోజే 300 ట్రాక్టర్లతో..



జేసీబీతో మట్టిని తవ్వేస్తున్న దృశ్యం

పోలాకి: మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. కోడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 15–4 లో 48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మండల పరిషత్ ఆధీనంలోని జీడిమామిడి తోటలో విలువైన మట్టి తరలింపు సర్వత్రా చర్చనీయాంశమైంది. శుక్రవారం ఒక్కరోజే 300 వందల ట్రాక్టర్లు వరకు మట్టిని ఎత్తేశారని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ స్థలం అందులోనూ మండల పరిషత్ ఆధీన స్థలంలోనే జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

కోడూరు పరిసర ప్రాంతాల్లో లభించే ఎర్రమట్టికి ప్రత్యేకమైన డిమాండ్ ఉంది. సముద్ర తీర ప్రాంతానికి దగ్గరలో ఉన్న సారవంతమైన ఇసుకతో కూడిన మట్టి కావటంతో ఇప్పుడు దీనిపై అందరి కన్ను పడింది. రియల్ ఎస్టేట్ ముసుగులో అక్రమంగా లేఅవుట్‌లు వేసి ఈ మట్టితో పంట పొలాలను చదును చేస్తుండటంతో మరింత డిమాండ్ పెరిగింది. ఈ ఎర్రమట్టిలో ఎలాంటి మొక్క వేసినా ఆరోగ్యవంతంగా పెరుగుతుందని అంటారు. ఇలాంటి మట్టిని నేరుగా జేసీబీలు పెట్టి అక్రమంగా తరలించుకుపోతూ లక్షలరూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసుక దోపిడీపై కన్నెర్ర



లారీలను ఎలా తనిఖీ చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

- 28 లారీల్లో 12 లారీలు నకిలీ బిల్లులేనని క్షేత్రస్థాయిలో గుర్తింపు
- 12 ఇసుక లారీలు సీజ్



పైడిభీమవరం ఇసుక చెక్‌పోస్టు వద్ద నిలిచి పోయిన నకిలీ బిల్లులు కలిగిన ఇసుక లారీలు

రణస్థలం: రణస్థలం మండలంలోని పైడిభీమవరం ఇసుక తనిఖీ కేంద్రం వద్ద 28 ఇసుక లారీలను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తనిఖీ చేయగా అందులో 12 నకిలీ బిల్లులతో రవాణా అవుతున్నట్లు తేలింది. దీంతో వెంటనే ఆయా లారీలను సీజ్ చేయాలని జేసీ ఆదేశించారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు నిత్యం వందలాది లారీల్లో ఇసుక రవాణా జరుగుతుంది. ఈ లారీలకు సక్రమమైన బిల్లులు లేవని తరచూ కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్తున్నాయి. దీంతో కలెక్టర్ ఆదేశాలతో జేసీ శుక్రవారం తెల్లవారుజాము నుంచి తనిఖీలు మొదలుపెట్టారు. ఇసుక లారీలకు బిల్లులు ఉన్నా లేకున్నా తక్షణమే పైడిభీమవరం జిల్లా ఇసుక చెక్‌పోస్టు వద్ద నిలిపివేయాలని రెవెన్యూ, పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో 28 ఇసుక లారీలను మండల స్థాయి అధికారులు పైడిభీమవరం చెక్‌పోస్టులో నిలుపుదల చేసి బిల్లులు తనిఖీలు చేశారు. బట్టేరు, బైరి, కాఖండ్యాం, గార, ఇసుక రీచ్‌ల నుంచి ఈ వాహనాలు వస్తున్నట్లు గుర్తించారు. చాలా బిల్లులు స్కాన్ కాకపోవడంతో డ్రైవర్లను ఆరా తీశారు. అనంతరం నకిలీ బిల్లులు గల 12 లారీలు సీజ్ చేసి మైన్స్ అండ్ విజిలెన్స్ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీలు జరుగుతున్నాయని తెలిసి రణస్థలం మండలంలోని యూబీ పరిశ్రమ ఎదుట, నెలివాడ, వరిసాం, పైడిభీమవరం గ్రామానికి ముందు పదుల సంఖ్యలో సుమారు 50కి పైగా ఇసుక లారీలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. ఈ తనిఖీల్లో మండల తహసీల్దార్ ఎన్. ప్రసాద్, ఎస్ఐ ఎస్.చిరంజీవి, విజిలెన్స్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

అరుదైన చెట్టుపిల్లి గుర్తింపు



సారవకోట: మండలంలోని వడ్డినవలస సమీప పొలాల్లో అరుదైన చెట్టు పిల్లిని గ్రామస్తులు శుక్రవారం గుర్తించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ ఎస్ఎఫ్ఓ లక్ష్మీపురం ఈశ్వరరావు, బీట్ అధికారి శివ ప్రసాద్ గ్రామానికి చేరుకుని చెట్టుపిల్లిని సారవకోట సమీపంలో ఉన్న రిజర్వ్ ఫారెస్టులో వదిలారు. అరుదైన అటవీ జంతువులు గ్రామాల్లోకి వస్తే వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

ఉద్యోగాల పేరిట మోసం



ధర్నా చేస్తున్న బాధితులు

టెక్కలి రూరల్: తమ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షలాది రూపాయలు తీసుకుని మోసం చేశారంటూ సంతబొమ్మాళికి చెందిన పందిరి అప్పన్న, సన్యాసమ్మ దంపతులు శుక్రవారం టెక్కలి గొల్లవీధిలో ధర్నా చేపట్టారు. ఇద్దరు దివ్యాంగు పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి టెక్కలి గొల్లవీధికి చెందిన ఓ మహిళ రూ.18లక్షల 60 వేలు తీసుకుందన్నారు. నేటికీ తిరిగివ్వలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు. డబ్బులు తిరిగివ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామంటు సన్యాసమ్మ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. పోలీసులు చొరవతో గొడవ సద్దుమణిగింది. ఇదే విషయమై టెక్కలి సీఐ విజయ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. కేసు కోర్టులో ఉందని తెలిపారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు



ప్రాబబుల్స్ క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు, పీడీలు, కోచ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్ బాలురు హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు శుక్రవారం ఉత్సాహభరితంగా సాగాయి. రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యేందుకు సర్వశక్తులూ ఒడ్డారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని పాత్రునివలస క్రీడామైదానం వేదికగా జరిగిన ఈ ఎంపికలకు సీనియర్స్ మహిళలకు అరకొరగా హాజరుకావడంతో.. కేవలం జూనియర్స్ బాలురుకు మాత్రం ఎంపికలు నిర్వహించారు. మొత్తం 45 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులతో కూడిన తుది జాబితాను త్వరలో వెల్లడిస్తామని శ్రీకాకుళం జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ చంద్రశేఖర్ తెలిపారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను ఈ నెల 21 నుంచి 23 వరకు కర్నూలు జిల్లా జిల్లా డీఎస్ఏ క్రీడామైదానం వేదికగా జరగనున్న 10వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల) హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రవిశేఖర్, డి.ఈశ్వరరావు, ఆర్.సతీష్‌రాయుడు, ఎల్.డిల్లేశ్వరరావు, డీఎస్ఏ కోచ్ ఎల్.అనీల్, లక్ష్మణరావు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 24,25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె



ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: న్యాయమైన డిమాండ్ల సాధన కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో దాదాపు పది లక్షల ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు మార్చి 24, 25 తేదీల్లో సమ్మెకు చేపట్టనున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ శ్రీకాకుళం కన్వీనర్ కేసీహెచ్ వెంకటరమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షించాలని, సిబ్బందిని సకాలంలో నియమించాలని కోరారు. పని ఒత్తిడి పెరగడం, డిజిటలైజేషన్ అందుబాటులో ఉన్నందున వారానికి ఐదు రోజులు మాత్రమే బ్యాంకులు తెరవాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల స్థానంలో శాశ్వత నియామకాలు చేపట్టాలన్నారు. 12వ వేతన సవరణలో భాగంగా మిగిలి ఉన్న డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ కృష్ణ కిషోర్, మండ శ్రీనివాసరావు, కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.


946 ఏళ్ల తర్వాత..

చారిత్రక ఉత్సవానికి సన్నద్ధం



శ్రీముఖలింగం ప్రధాన ఆలయం

- 17న శ్రీముఖలింగంలో అనంత వర్మ చోడ గంగదేవుడి పట్టాభిషేకం
- సన్నాహాలు చేస్తున్న నిర్వాహకులు



ఒడిశా ప్రభుత్వం విడుదల చేసిన ఉత్సవాల పోస్టర్



అనంత వర్మచోడ గంగదేవుడు

జలుమూరు: చారిత్రక ఉత్సవానికి శ్రీముఖలింగం ముస్తాబవుతోంది. నాటి కళింగ సామ్రాట్ అనంత వర్మచోడ గంగదేవుని పట్టాభిషేక ఉత్సవం జరిగి 946 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో 947వ పట్టాభిషేక మహోత్సవాన్ని ఈ నెల 17న నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గురువారం ఉదయం ఒడిశా రాష్ట్రం పర్లాఖిముండి గజపతి రాజభవనం వద్ద నిర్వాహకులు ఉత్సవాల పోస్టర్ విడుదల చేశారు. కళింగ రాజధానిగా వెలుగొందిన శ్రీముఖలింగం(కళింగ నగరం) తూర్పు గంగ వంశపరిపాలనలో గొప్ప ఘనత సాధించింది. ఈ వంశకాలంలో కళింగ సామ్రాజ్యం ఉత్తరంలో గంగానది నుంచి దక్షిణంలో గోదావరి వరకూ విస్తరించింది. సైనిక, సాంస్కృతిక, శిల్పకళా వైభవంలో కళింగ సామ్రాజ్యం ఓ వెలుగు వెలిగింది.

పూరి మొదలు శ్రీకూర్మం వరకు..

పూరి జగన్నాథ ఆలయానికి చోడగంగదేవుని పాలనలో పునాది పడింది. అయితే నిర్మాణం పూర్తి కాలేదు. తర్వాత వచ్చిన రాజులు దీనిని పూర్తి చేశారు. శ్రీముఖలింగం దేవాలయం మొదటి కామర్నవ దేవుడు నిర్మించగా అనంత వర్మ వజ్రహస్తకుడు దేవుడు(చోడగంగదేవుని తాత) పూర్తి చేశాడు. చోడ గంగదేవుడు ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేశాడు. శ్రీముఖలింగం కళింగ సంస్కృతికి ముఖ్య కేంద్రం. ఇక్కడ శాసనాలు ఆయన పాలన విధానాన్ని వివరింగా చెబుతాయి.

హరిహరుల భక్తుడు..

జగన్నాథుడి భక్తుడిగా ప్రసిద్ధి చెందిన చోడ గంగదేవుడు శైవభక్తుడు కూడా. మధుకేశ్వర దేవాలయానికి పెద్ద మొత్తంలో దానాలు ఇచ్చినట్లు శాసనాలలో పొందుపరిచి ఉంది. ఇతను ముందు శైవుడు.. తర్వాత వైష్ణవుడయ్యాడని కొంతమంది చరిత్రకారులు అంటారు. నిజానికి ఇతను రెండింటికీ ప్రాధాన్యమిచ్చారు. శ్రీకూర్మం(కూర్మనాథస్వామి) ఆలయంతో పాటు ఒడిశాలో అనేక శైవ, వైష్ణ ఆలయాలకు పెద్ద ఎత్తున విరాళాలు అందించారు. 70 ఏళ్లకు పైగా కళింగ రాజ్యాన్ని పరిపాలించిన ఈయన భారతదేశంలో గొప్ప రాజులలో ఒకరిగా నిలిచిపోయారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన అనంత వర్మ చోడ గంగదేవుడు పట్టాభిషేకం 946 ఏళ్ల తర్వాత మరోసారి శ్రీముఖలింగంలో నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఇదీ ఘన చరిత్ర

అనంత వర్మ చోడ గంగదేవుడు గంగ వంశాధిపతి. శ్రీముఖలింగం దేవాలయం నిర్మాణానికి బలమైన ఆధారాన్ని అందించిన రాజు. ఇతను తండ్రి దేవేంద్రవర్మ రాజరాజా, తల్లి రాజరాజాదేవి. ఈమె చోళ రాజ కుమార్తె. గంగ, చోళ వంశాల కలయికలో జన్మించిన చోడగంగదేవుడు చాలా శక్తివంతమైన పరిపాలకుడు. ఇతను తన సామ్రాజ్యాన్ని ఒడిశా,(ఆదికాలంలో కళింగ), ఆంధ్రప్రదేశ్‌తోపాటు మరికొన్ని ప్రాతాలను తన నియంత్రణలోకి తెచ్చాడు. బలమైన సైనికుడుగా తన రాజ్యాన్ని స్థిరంగా ఉంచాడు. అంతే కాకుండా యుద్ధవీరుడిగానూ పేరుగాంచాడు. పాలన ప్రారంభంలో కొన్ని కష్టాలు కూడా ఎదురయ్యాయి. చోళ రాజు కులోత్తుంగతో పలు యుద్ధాలు చేశాడు. తిరిగి రాజ్యాన్ని బలపరుచుకొని ఉత్కళ దేశాన్ని సైతం తన గుప్పెట్లో ఉంచుకున్నాడు.

సమర్థవంతమైన పాలన..



అనంత వర్మ చోడ గంగదేవుడు కళింగ రాజ్యాన్ని ఎక్కువ కాలం అంటే సుమారు 70 ఏళ్లకు పైబడి సమర్థంగా పాలించారు. కళింగ రాజ్యంతో పాటు మన విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళంలో సింహాచలం, శ్రీకూర్మ దేవస్థానం, అరసవల్లి, శ్రీముఖలింగం, ఒడిశాలో కూడా ఎన్నో దేవాలయాలను అభివృద్ధి చేశారు. శ్రీముఖలింగం రాజధానిగా పరిపాలన చేస్తూ కటక్‌ను కూడా రాజధానిగా మార్చి మంచి పాలన అందించారు.

– కొల్లూరి సూర్యనారాయణ, ఆర్కియాలజీ విశ్రాంత ప్రొఫెసర్, ఆంధ్ర యూనివర్సిటీ

నేటి తరాలకు తెలియాలి..



శ్రీముఖలింగం అత్యంత చారిత్రాక, ఆధ్యాత్మిక ప్రదేశం. వేల సంవత్సరాల నాటి పూర్వవైభవం మళ్లీ తెస్తున్నందుకు సంతోషం. దీర్ఘకాలం పాలన చేసిన అనంత వర్మ చోడ గంగ దేవుడు చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది. ఇలాంటి పురాతన, మరెన్నో విశేషాలు శ్రీముఖలింగంలో ఉన్నాయి. నాటి కళింగ రాజ్యం రాజధానిగా చేసుకొని పాలన చేసిన రాజు వైభవం పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియనుంది.

– డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, పలాస

ప్రాణం తీసిన లాంగ్‌డ్రైవ్ సరదా

- హైవేపై అదుపు తప్పిన బైక్
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి.. భార్యకు గాయాలు



మృతుడు అభిషేక్ బెహరా



గాయపడిన అన్నయ్‌పార్థన్

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై బైక్‌పై లాంగ్ డ్రైవ్ చేసుకుంటూ గమ్యం చేరాలనుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కుటుంబాన్ని విషాదం వెంటాడింది. బైక్ అదుపు తప్పడంతో మృత్యువు వెంటాడింది. భర్త ప్రాణాలు కోల్పోగా.. భార్య గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రానికి చెందిన అభిషేక్ బెహరా (40) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. బాలాసూర్ కుర్దా నుంచి భార్య అన్నయ్‌పార్థన్‌తో కలిసి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై బెంగళూరు పయనమయ్యాడు. హెల్మెట్‌తో పాటు టూర్ కిట్‌తో సకల జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం మొదలుపెట్టారు. శుక్రవారం ఉదయం 10.45 గంటలకు ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట పంచాయతీ నవభారత్ నగర్‌కాలనీ సమీపంలోకి వచ్చేసరికి బైక్ స్కిడ్ కావటంతో అభిషేక్ బెహరాకు తీవ్ర గాయాలు కాగా, భార్య అన్నయ్‌పార్థన్ స్వల్పంగా గాయపడింది. స్థానికులు అందించిన సమాచారంతో 108 సర్వీస్ అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం అభిషేక్ బెహరా మృతి చెందారు. అన్నయ్ పార్థన్‌కు ప్రాణాపాయం తప్పింది. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ట్యాంకులో వ్యక్తి మృతదేహం



మృతిచెందిన స్వామి

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిఆంధ్ర వీధి సమీపంలో ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత మంచి నీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో వ్యక్తి మృతదేహం బయటపడటం శుక్రవారం కలకలం రేపింది. కె.కొత్తూరు సమీపంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మెస్‌లో మేనేజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న పాలకొల్లుకి చెందిన చందనాల స్వామి(42) ఈ 12న తన ఊరు వెళ్తానని చెప్పి ద్విచక్రవాహనంపై బయటకు వచ్చేశాడు. ఏం జరిగిందో గానీ శుక్రవారం సాయంత్రం ఆదిఆంధ్రవీధి సమీపంలోని రక్షిత మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో శవమై తేలడాన్ని అక్కడి సిబ్బంది గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే ఉన్న ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. టెక్కలి పట్టణానికి సరఫరా అయ్యే తాగునీటిలో మృతదేహం ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

గంజాయి స్మగ్లర్లు అరెస్టు

- 18 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఒడిశా నుంచి బెంగళూరుకు తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



ఇచ్ఛాపురం: వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి కర్ణాటకకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం చిక్కమంగుళూరు జిల్లా రాఘవేంద్రనగర్ గ్రామానికి చెందిన ముజామిల్.. ఉప్పలి హిరేకోలలే రోడ్డుకు చెందిన మహ్మద్ సిరాజుద్దీన్‌లు కలిసి బెంగళూరులోని ఇందిరానగర్‌లో నివాసముంటున్నారు. గంజాయికి బానిసయ్యారు. డబ్బు సంపాదనకు గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకొన్నారు. ఈ క్రమంలో బెంగళూరులో గంజాయి అక్రమ వ్యాపారం చేస్తున్న విజయ్‌కుమార్‌కు గంజాయి ఇచ్చేందుకు ఒడిశా వెళ్లారు. ఖందమాల్ జిల్లా ఫుల్బాని ప్రాంతానికి చెందిన భరత్ డింఘాల్ వద్ద 18.310 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. బరంపురం నుంచి బస్సులో బయలుదేరి ఇచ్ఛాపురం బస్టాండ్‌కి శుక్రవారం చేరుకున్నారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా స్టేషన్ సమీపంలో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గంజాయి అక్రమ రవాణా జరగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్న ఇచ్ఛాపురం సర్కిల్ పోలీస్ సిబ్బందిని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి అభినందించినట్లు డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, పట్టణ ఎస్సై ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు..

2 కిలోల గంజాయి స్వాధీనం

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్ సిబ్బంది క్వార్టర్స్ సమీపంలో 2.080 కిలోల గంజాయితో ముగ్గురిని కంచిలి పోలీసులు శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం సుర్లా జంక్షన్‌లో గంజాయి కొనుగోలు చేసి చెన్నైకు రైలులో తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా వీరు పట్టుబడ్డారు. ఈ మేరకు కాశీబుగ డీఎస్పీ వి.వెంకట అప్పారావు శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన అజిత్ లారీ క్లీనర్‌గా పని చేస్తూ కోల్‌కతాకు లోడ్‌తో వచ్చినప్పుడు ఒడిషా రాష్ట్రం సుర్లా జంక్షన్ వద్ద టిఫిన్ షాప్ వద్ద ఆపేవాడు. ఈ క్రమంలో బలియాగూడకు చెందిన బొద్ది సోమేశ్‌తో పరిచయం ఏర్పడింది. అక్కడ అతను చాలా మంది డ్రైవర్లు, క్లీనర్లకు గంజాయి అమ్మేవాడు. అజిత్‌కు గంజాయి తాగే అలవాటు ఉండటంతో సోమేష్ వద్ద గంజాయి కొనుక్కొని తాగేవాడు. ఈ క్రమంలో రెండు, మూడుసార్లు కొనుక్కొని చెన్నైకి తీసుకెళ్లేవాడు. అక్కడ చిన్నచిన్న పొట్లాలుగా చేసి అమ్మేవాడు. లాభాలు రావడంతో తన స్నేహితుడు కమలుద్దీన్ కూడా గంజాయి వ్యాపారం చేయాలని ఆశతో అజిత్‌ను అడగ్గా ఇద్దరూ ఈ నెల 11న చెన్నై నుంచి బయలుదేరి 13వ తేదీ వేకువజామున సుర్లా జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ సోమేశ్‌ను కలిసి కేజీ రూ.10వేలు చొప్పున రెండు కేజీల గంజాయి కావాలని కోరారు. అందుకు సోమేష్ ఒప్పుకుని 14వ తేదీ సాయంత్రం సోంపేట రైల్వేస్టేషన్ వద్దకు వస్తే అక్కడ 2 కేజీల గంజాయి అందిస్తానని చెప్పాడు. దీంతో అజిత్, కమలుద్దీన్‌లు 13వ తేదీ రాత్రి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద బసచేసి 14వ తేదీ సాయంత్రం అప్పగిస్తుండగా కంచిలి పోలీసులకు దొరికిపోయారు. కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు, సిబ్బంది దాడి జరిపి నిందితులు సుర్లా జంక్షన్‌కు చెందిన బి.సోమేష్, చెన్నైకు చెందిన అజిత్, కమలుద్దీన్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, 2.080 కిలోల గంజాయి, నల్లటి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు పాల్గొన్నారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

గంజాయి పట్టివేత

టెక్కలి రూరల్: టెక్కలి సమీప తోటల్లో శుక్రవారం గంజాయి తాగుతున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి కొందరిని అదుపులో తీసుకున్నట్లు సమాచారం. కొంత గంజాయి కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

థర్మల్ ప్లాంట్‌తో సహజ వనరులు నాశనం



ఆదివాసీ, గిరిజనులతో కలిసి నిరసన తెలియజేస్తున్న చింతాడ రవికుమార్

- గిరిజనుల ఉద్యమానికి మద్దతు
- ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్

సరుబుజ్జిలి: థర్మల్ విద్యుత్ కేంద్రం పేరుతో సహజ వనరులను నాశనం చేయవద్దని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శుక్రవారం గిరిజనులు, ఆదివాసీలతో కలిసి వెన్నెలవలసలోని థర్మల్ ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. ఉద్యమానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆదివాసీల మనోభావాలను గౌరవిస్తుందని, వారి హక్కులకోసం జరిగే పోరాటానికి మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే గిరిజన పాఠశాలలు, జవహర్ నవోదయ విద్యాలయం, పచ్చని పంట పొలాలు నాశనం కావడంతో పాటు గ్రామాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదముందన్నారు. అన్ని వర్గాలు థర్మల్ వ్యతిరేక పోరాట ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించి కూటమి ప్రభుత్వ కుతంత్రాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర న్యాయ సలహాదారు చౌదరి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, థర్మల్ విద్యుత్ కేంద్రం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, ఉద్యమ నేతలు బీన జ్ఞానేశ్వరి, ఢిల్లీశ్వరి, తామాడ అప్పలస్వామి, పొందర మురళి, వైఎస్సార్‌సీపీ నేతలు ఖండాపు గోవిందరావు, అత్తులూరి రవికాంత్, దుంపల శ్యామలరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులు అమానుషం



కాశీబుగ్గలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పలాస: ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న సైనిక బలగాల దాడులను తక్షణమే నిలుపుదల చేయాలని సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీపార్టీతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మావోయిస్టుల పేరుతో అడవుల్లో ఉన్న మూలవాసులను తరిమికొట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా చర్యలను దేశ ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.మాధవరావు, సి.పి.ఐ జిల్లా కార్యదర్శి చాపర వేణు, సి.పి.ఐ.ఎం. నాయకులు కోనారి మోహనరావు, లిబరేషన్ నాయకుడు తామాడ సన్యాసిరావు, పత్తిరి దానేసు, జోగి కోదండరావు, సాలిన వీరాస్వామి, మద్దిల ధర్మారావు, కొర్రాయి నీలకంఠం, పోతనపల్లి కుసుమ, బదకల ఈశ్వరమ్మ, బర్ల జానకమ్మ, గొరకల బాలకృష్ణ, పోతనపల్లి అరుణ, కోనేరు రమేస్, సార జగన్, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళులు



దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం సంజీవయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఖాన్‌తో కలిసి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతిశ్రీ, ఎస్‌డీసీ పద్మావతి, అప్పారావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వ మోహన్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ, కలెక్టరేట్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనూషకు రూ.లక్షన్నర ఆర్థిక సాయం

సాక్షి ఎఫెక్ట్



హెల్పింగ్ హ్యాండ్స్ నుంచి చెక్ అందుకుంటున్న అనూష తండ్రి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని గుజరాతిపేటకు చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థిని అనూష బ్రెయిన్‌స్ట్రోక్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. ఈ విషయమై 'పేదింట పెద్ద కష్టం' అనే శీర్షికన ఈ నెల 10న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు స్పందించి హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా లక్షన్నర రూపాయలను శుక్రవారం అనూష తండ్రికి చెక్ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, రిజిస్ట్రార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో కోత

- అసంతృప్తి వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- సాయంత్రానికి పూర్తిస్థాయిలో సరఫరా

ఎల్.ఎన్.పేట: మండలంలోని సిద్ధాంతం గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీలో అధికారులు కోత విధించారు. రేషన్ సరుకుల నిల్వల్లో తేడాలు ఉన్నందున వీటిని సరిచేసేందుకు లబ్ధిదారులకు ఇచ్చే బియ్యంలో కోత విధించడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధాంతం రేషన్ డిపో డీలరు కొన్ని నెలల క్రితం పోస్టుకు రాజీనామా చేశారు. అప్పటికే కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యంలో సుమారు 16 క్వింటాళ్ల బియ్యం తేడాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రేషన్ బియ్యం పంపిణీ చేపట్టారు. 16 క్వింటాళ్ల బియ్యం తేడాలను సరిచేసేందుకు కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో అనధికారికంగా కోత విధించారు. అంత్యోదయ కార్డు లబ్దిదారులకు 35 కిలోలకు 25 కిలోల బియ్యం ఇచ్చారు. 20 కిలోల కార్డుదారులకు 15 కిలోలు, అదే విధంగా 15 కిలోల కార్డుదారులకు 13 కిలోలు చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. పూర్తి బియ్యం ఇచ్చినట్లు బయోమెట్రిక్ తీసుకున్నారు. ఈ విషయమై టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వద్ద ప్రస్తావించగా సమగ్ర విచారణ చేయిస్తానని తెలిపారు. కాగా, విషయం బయటకు పొక్కడంతో కార్డుదారులకు తక్కువగా ఇచ్చిన బియ్యాన్ని ఎల్.ఎన్.పేట సీఎస్‌డీటీ సాయంత్రం పంపిణీ చేశారు.

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

సారవకోట: మండలంలోని కోదడ్డపనస గ్రామంలో ఈ నెల 10న పదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పిర్ల రామారావు అలియాస్ ముకుందరావును శుక్రవారం డీపీటీసీ డీఎస్పీ ప్రసాదరావు అరెస్టు చేశారు. వడ్డినవలసలోని త్రినాథస్వామి దేవాలయం సమీపంలో రామారావును అదుపులోకి తీసుకుని విచారించి అరెస్టు చేసి పాతపట్నం కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. కాగా, ముకుందరావు గతంలోనూ గ్రామంలో పలువురిని ఇలాగే వేధించగా దేహశుద్ధి కూడా జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపుపై విచారణ నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించగా, బాధితులు లేబర్ కోర్టులో జనవరి 2న ఫిర్యాదు చేశారు. దీనిపై పలు వాయిదాల అనంతరం శనివారం మరోసారి విచారణ జరగనుంది. బాధితులు నెలన్నరగా విధులు లేక ఖాళీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో లేబర్ కోర్టులోనైనా న్యాయం జరుగుతుందేమోనని వీరంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.